# ★ బలే మామయ్యా......!

★ బి. కె రావు ★

ఇంతట్లో మా మామయ్య రెండెద్దులబండి దిగాడు. మా వాళ్ళందరికీ కొంచెం ప్రాణ మొచ్చింది. ఇంక రాత్రి పర్వాలేదురా, మా మామయ్య సాయముంటాడనుకొన్నాను.

అన్నట్లు చెప్పడం మరిచాను మా మామయ్యంటే మా అమ్మ స్వయానా తమ్ముడే. అందులో పిల్లనిచ్చిన మేనమామకూడాను. చూస్తే, అజానుబాహువు, 55 యేండ్లున్నప్పటికి, కుర్రాడిలాగ ఉంటాడు. శాండో అన్నమాట

ఇంక రాత్రిపడింది భోజనానికి లేచాము. "సావకాశముగా కూర్చో మామయ్యా. రాత్రి జాగారంకూడాను" అన్నాను

"అదేమిట్రోయ్" అన్నాడు.

"అబ్బే. యేమీలేదు ఈ కరువేమిటో, యీ దరిద్రమేమిటోగాని మావూళ్లో దొంగతనాలు, మొదలెట్టారు నెలనుంచి మాకు నిద్రాహారాలు లేవు. ఊరంతా రాత్రి మేలుకొనటం, పగలు "నిద్ర" అన్నాను

"ఏడిశావ్, దొంగలూ లేరు. దోపిడీలు లేవు ఎవరొస్తారో నేను చూస్తానుగా, మీరంతా పడుకోండి యీవేళ, దొంగలు యెలా పడ్తారో చూస్తాను" అన్నాడు మా మామయ్య.

"చాల్లే, నీ డబుక్కులు, ఎలా పడతారంటావేమిటి? మా ప్రక్కయింట్లో పడి నిన్ననేగా, వెండిసామాను లెత్తుకోపోయారు" అన్నాను.

"బాగా చెప్పావు, నీలాంటి పిరికిపందలుంటే యింకా మీదపడతారు రక్కుతారుకూడాను. ఇంతకన్న పెద్ద పెద్ద దొంగతనాలు చూశాను. చెప్పొచ్చావు శ్రీరంగనీతులు నాకు" అని దభాయించాడు.

రాత్రి 10 గంటలైంది. ఊరంతా నిశ్శబ్దముగా ఉంది. అయితే, ప్రతింట దీపాలు మిణుకు మిణుకు మంటూనే వున్నాయి. ఎవరింటో యెప్పుడు పడతారనేగా భయము

మా మామయ్య కిటికీకి దగ్గరగా, గోడనాన్చి వేసికొన్నాడు మంచం ఆయన ప్రక్కన నే మంచం వేశాను, గంటలో గుర్రుపట్టేశాడు ఆ గుర్రుకు దోమలుకూడ దరికి చేరటంలేదు.

ఇంతట్లో, "హారి, లంజకొడుకా, వెధవా, దొరికినావురా, దొరకినావ్ నిన్ను యేమిచేస్తానో చూడు" అంటూ కేకలు వినపడ్డాయి.

దొంగలు పడ్డారనుకొని, వెంటనే లేచాను. దీపం పెద్దదిచేశాను. కర్ర వెతకినాను, నలుప్రక్కలా చూశాను

చూస్తే, మా మామయ్య "ఏం చేస్తానంటావా? చూడు" అంటూ తన చేతిలో నున్న బలమంతా కూడదీసి, వేసి కొట్టాడు గోడని, చేయి నెప్పిపెట్టిందికాబోలు పాపం, లేచాడు, "చంపావురా, చంపావు," అంటూ లేచి చేయిచూసికొంటున్నాడు.

ఈయన కేకలు విని ప్రక్కింట్లో వాళ్ళు కర్రలు, దీపాలు పటుకొని, "ఏడి, దొంగ, ఏది, దొంగ" అంటూ మా యింటిమీద పడ్డారు,

ఇంక నాకు నవ్వు ఆగదు.

మా నవ్వులు చూశారు సంగతి గ్రహించారు "బలే మామయనే సంపాదించావయ్యా, బలే 'శూరత్వ'" మనుకుంటూ వెళ్ళిపోయారు